

# మధ్యవర్తి

చంద్రశ్రీ

★

అంకితం
శ్రీమతి
రాధకు

“ఎంత ఇదైనా ఇంతమరీ పబ్లిక్‌గావచ్చేశెయ్యటం మంచిపనికాదు. నిన్ను చేసుకున్నంమకు అతని సంసారం పాడుచేసి రావటం—చాలా అధర్మమైనపని. ఫలానావారి అమ్మాయి; ఇలా చేసిందనగానే--నీ తలిదండ్రులకు-అత్తమామలకు అందరికీ తలవొంపులు. అతనికేం అతను మగవాడు. రేపు ఈపాటికి మళ్లీ పెళ్లిచేసుకుంటాడు. కాని ముందునీగతి ఏమవుతుందో చూసుకున్నావ్?... ఇప్పటికైనా మించిపోయినదేమీ లేదు. ఇంకా ఈవిషయం అందరికీ తెలియదు. నామాటవిని ఇంటికొచ్చేశావంటే; చిన్నతనపు చేష్టలు ఏదో తెలియక చేసిందని--అటు వారికి-ఇటు వీరికి-నచ్చజెప్పి--మీ సంసారం బాగుచేస్తా... నా మాటైనా వింటావనే వుద్దేశ్యంతో-మీ వెనకాలే ఇంతదూరం వొచ్చేశా.”

అని అన్నాడు మా మామయ్య-నేనూ ప్రకాశరావూ; బెజవాడ స్టేషన్లో-వెయిటింగ్ రూములో కూర్చుని టీ తాగుతూ వుండగా.

ప్రకాశరావు టీ తాగటం పూర్తిచేసి-క్యాంప్‌కాట్ మీద పడుకుని సిగరెట్ ముట్టించాడు. మేమిద్దరం కుర్చీల్లోనే కూర్చుని మెల్లిగా మాట్లాడుతున్నాం...

“మామయ్యా! నువ్వంటే నాకు ఎప్పుడూ గౌరవమేకాని; అనవసరంగా తొందరపడి ఈ విషయంలో జోక్యం కలిగించుకున్నందుకు విచారిస్తున్నా... మీ ఉద్దేశ్యం ప్రకారం-నేను ఇతనితో వొచ్చేశానంటే; ఆ పవిత్రురాలినీ- పాపినీ__అయానా లేదా?...ఇప్పుడు మళ్లీనే తిరిగి

వొచ్చి ఆ సుబ్బారావు గారితో కాపరంచేస్తే; పవిత్రురాలినీ- పతివ్రతనూ అవుతానా?...మీరన్నట్లు నే పతితురాలినే అయితే-నేనుమళ్లీ రాగానే వారంతాకూడా పతితులై పోరూ?...ఎంత ప్రేమవున్నా పబ్లీక్ గా వొచ్చెయ్యటం మంచిపని కాదంటావు... రహస్యంగా- అతనితో గడ్డివాముల చాటున పశువుల శాలల్లో-పాడు దేవాలయాల్లో- కలుసుకుంటూ వుండటం మంచి పనేనా?... ప్రేమించిన-యువకుని- వదిలేసి. ఇష్టంలేని యువకునిదగ్గర- గ్లాస్కో చీరకట్టుకుని తల్లో పూలు ముడుచుకుని-శరీరం మీద అధికారం పోగొట్టుకుని తెల్లవార్లూ- ఆయనగదిలో పడుకోమంటావే- నాకేం ఖర్మంపెట్టింది చెప్పు... నువ్వు కాస్తైనా యోచించి అన్న మాటేనా అది?...అని నీకేం మగవాడు-మళ్లీ పెళ్లి చేసుకుంటానన్నావు. సరే చేసుకోనే-కాని- ప్రేమించిన స్త్రీని చేసుకోమని మాత్రం నువ్వు సలహా ఇయ్యి .. తాను ధనవంతుడ ననే వుద్దేశ్యంతో ఇష్ట మొచ్చినస్త్రీని బలవంతంగా మాత్రం వివాహం చేసుకోవద్దని చెప్పు...ఇంకా నలుగురికీ తెలియలేదన్నావు...ఏం తెలిస్తే?...నలుగురికీ తెలిస్తే నన్నేంచేస్తారు?...లేచి పోయిందని చెప్పుకుంటారు. చెప్పా కోనీ-ఆ అగ్రహారాల్లో-రహస్యంగా జరిగే వ్యభిచారాలకంటె-ఇదిచాలా మంచిపని కదూ?...నలుగురికీ తెలియలేదని-మళ్లీ నన్ను సంఘంలో కలుపుకుంటే-సంఘం కుళ్ళిపోకుండా వుంటుందా? రహస్యాలు దాపరికాలు ఎందుకు మామయ్యా!..." అన్నా ప్రకాశరావు-ప్రయాణపు-బడలికచేత నిద్రపోయాడు- నేను-టీ తాగటం పూర్తిచేసి-ఫ్యూన్‌ను పిలిచి- ఫాన్ వేయమని చెప్పా... ఉక్కపోస్తూంటే-మామయ్యా-మళ్లీ నస్యం ఇంకో చిటికపీల్చి చెప్పటం ప్రారంభించాడు...

"సుశీ!...అనుకూలమైన సంబంధమని--ఈయనకోసం వెతికి వెతికి-డబ్బులేనివాడికి ఇస్తే-నువ్వు కష్టపడి పోతావని-అయిదువేల కట్నం ఇచ్చి పెళ్ళిచేసినందుకు మంచిపనే చేశావు. ఇంతదాన వౌతావని ఎప్పుడూ అనుకోలేదే! ..." అన్నాడు-కొంచెం అసూయతతో.

"అనుకూలమైన సంబంధం అంటావు. ఏమిటి వీళ్ళుచూసే అనుకూలత మనిషిఎత్తు లావు వున్నాడా లేదా?—ఎర్రగా వున్నాడాలేదా?...అతను-ఆ కుటుంబంలోవారూ అంతా మూడు పూట్లా సంధ్యావందనం చేస్తారా చెయ్యరా?...అని ఇంతేగా వీరు చూసే అనుకూలత. ఆవంశంలోనే ఎవరైనా వైశ్యదేవం చేస్తే- ఆ హితాగ్ని కుటుంబం వెయ్యి జన్మాలెత్తినా ఇలాంటి సంబంధం దొరకటం కష్టం అంటారు. వివాహానికి- ఆ హితాగ్ని కుటుంబానికీ సంబంధంఏమిటి చెప్పు?......తమలపాకునో టి కందిస్తే మడికట్టుకున్నాం. ఎక్కడ మైలపడతామో అని మైలు దూరం పరుగెత్తుతారు. ఎంత అసహ్యంగా వున్నా- మళ్లీ వాళ్లు తిన్న ఎంగిలి విస్తరిలోనే భోంచెయ్యాలి పెళ్లాం- అంటారు. ఇలాంటి వాళ్లకు పెళ్లాలు ఎందుకు చెప్పు. శుభ్రంగా- రాగిచెంబు పంచపాత్ర త్రిప్పితే... అనుకూలత అంటే- ఇద్దరి మనస్సులు అనుకూలంగా వుంటాయా వుండవా అని ఆలోచించాలి కాని; ఆకారం- ధనం- చదువు. పొడుగు; లావు- చూస్తే ఏం లాభం చెప్పు... రసికూడౌతాడా?...ఇంత ఎందుకు మామయ్యా! ఆయన మనస్సుకూ- నా మనస్సుకూ చాలా తేడా వుంది. అంత మనస్సు కలియని వానితో కాపరం ఎలా చెప్పు?...నాబోటివారు ఎవరన్నా ఇలా మాట్లాడితే; చదువుకుని పాడైపోయి ఇలా వాగారంటారే కాని- అందులో వున్న తత్వం గ్రహించరు కదా?... పైపెచ్చు తిడతారు ఇంకా..."

"ఎలాగైనా మనస్సులు అనుకూలమయ్యేట్లు చూసుకోవాలి గాని; హైందవ సాంప్రదాయానికి విరుద్ధంగా- మనస్సులు కలియలేదు లేచిపోతానంటే?— లోకులకైనా వెర వద్దూ?..."

మనస్సులు మనం కలపాలంటే కలిసేవి కాదు. ఎవరి తరం మనస్సులు కలపటం?...విరిగిన పాలను- మంచి పాలనుగా చెయ్యగలరా?... విరగనంత వరకే గాని- విరిగిన తరువాత మనస్సులూ అంతే!...లోకులకు వెరవద్దా అంటావు...ఎందుకు వెరవాలి?...లోకం కోసం వెరచి ఎవరి సుఖాన్ని ఎవరు చెడగొట్టుకుంటారు?...ప్రతి దానికీ లోకానికి వెరిచేటంత అస్వతంత్రురాలిని కాదు నేను...ఇది సృష్టియొక్క సహజ గుణం. సృష్టి రహస్యం తెలిసిన వారెవరూ ఇలాంటి విషయాల్లో- లోకానికి జరుపవలసిన పనిలేదు..."

"సుశీ! ఈనాడు కాస్త ఇంగ్లీషు చదివావని హిందూ సాంప్రదాయాల్ని ధిక్కరించి- ఇలా వ్యభిచరించటం- సంఘ బాహ్యమైన విషయం.. అసలిది చాలా తప్పు కూడాను..."

నువ్వన్నట్లు వ్యభిచరించటం తప్పు అని వొప్పుకుంటా. కాని వ్యభిచరించటం అంటే ఏమిటి అసలు. మనస్సు ఇంకో పురుషుని మీదికి చలించడం. మనస్సు చలిస్తేనేగా- రేణుక చేతిలోని కుండ బ్రద్దలై పోయింది. నిజంగా నేను సుబ్బారావు గారితోనే కాపరం చేస్తే వ్యభిచరించిన దాన్నే అవుతా... నేను చిన్నప్పటినుంచి ప్రకాశరావునే ప్రేమించా. అతను ఒక్క నిమిషం కనపడక పోతే- ఏదో అంతా శూన్యంగా గోచరిస్తుంది...ఇన్నాళ్లూ సుబ్బారావు గారితో కాపరం చెయ్యలేదా అంటావేమో!...నిజమే. చాలా భాగం ఆయనగారు నామీద ఔదార్యం చూపించారు...ఏదో చిన్నతనంలో పెళ్లి చేశారని- ఆయనకు లోబడి వుండి; ఆయన్ని తప్పితే- ఇంకో పురుషుణ్ణి తెలిసేట్టుగా- ప్రేమించకూడదు. అంటే నేనొప్పుకోను. ఒకర్ని ఒకరు- ఆజ్ఞ పెట్టవలసిన- అగత్యం లేదు. అసలు ఎవరికీ హక్కు కూడా లేదు...పైకి కామాన్ని జయించామని, సంసార నీతులు చెబుతూ- వేదాంత శ్రవణాలు చేస్తూ- రహస్యంగా- అగ్రహారాల్లో మాదిరిగా- కనపడిన వాణ్ణల్లా శివాలయం లోకి పిలిచి- వెధవ కక్కుర్తికి లోబడుతూ, మళ్లీ చేసుకున్న భర్త కనపడేసరికి పతివ్రత లాగా- నటించటం- నాకు గిట్టదు. కపటమూ మోసమూ; అన్యాయమూ చేస్తూ- సుబ్బారావు గారి కళ్లు గప్పి- సంచరించటం నాకు మనస్కరించలా...ప్రేమించినప్పుడు ఇంకోర్ని- రహస్యం దాపరికం ఎందుకూ?..."

నాకు మనస్సులో కొంచెం ఉద్రేకం కలిగింది...

మా మామయ్యా కూడా; కొంచెం ఉద్రేకంగా; కించిత్కోపంతోనూ మాట్లాడాడు...

"ఇదిగో! ఆఖరి మాట చెబుతున్నా. నా మాట విన్నావంటే బాగు పడుతావు. నీకు యీ సౌందర్యం శాశ్వతంగా నిలిచేది కాదు... పిల్లలు పుట్టారంటే- తగ్గిపోతుంది. నీ సౌందర్యం ఎప్పుడైతే నశిస్తుందో- అప్పుడు ప్రకాశరావుకు- ఈ ప్రేమ- ఈ మోహం నశించి పోతుంది. అతని దగ్గిర- వున్న డబ్బు అయిపోయాక- నీకు తిండి కూడా వుండదు...చేసుకున్న భర్తకు ఎంత ఆపత్కాలంలో వున్నా; భార్యను పోషించటం తప్పదు. అతనికేం అవసరం?...తరువాత నువ్వు పడే అవస్థ కుక్కలు నక్కలు కూడా పడవు. బాగా ఆలోచించుకో..." అన్నాడు...

"ఎన్నిసార్లు- ఎన్ని విధాల చెప్పినా- నా మనస్సు నీకర్థం కాలేదు మామయ్యా! నువ్వు పుట్టిన నాటికి ఇంకా ఇరవై యేళ్ళు దాటింతర్వాత పుట్టినట్లయితే- నా మాటలు కొంతవరకైనా అర్థమయ్యేవేమో!...డబ్బు లేకపోయినా; మేమిద్దరం కలిసి వుంటే; అడవుల్లో; గింజలూ; దుంపలూ; తింటూనైనా- కాలక్షేపం చెయ్యగలం...ప్రేమ ప్రధానం కాని- శత్రువింట్లో పంచ భక్ష్య పరమా

న్నాలు తింటేమాత్రం తృప్తి వుంటుందా?... చక్కగా; ఆ చెట్ల మధ్య- ఆ వెన్నెల ఆకాశం క్రింద- ఆ పిట్టలు సంగీతం పాడుతూంటె- ఆ రంగు రంగుల పురుగులు ఎగురుతోంటే, ఆ పచ్చటి గడ్డిమీద... అంతకంటె సౌఖ్యం ఇంకేముంది మామయ్యా!...సృష్టి సౌందర్యం అక్కడ వుంది కాని- ఇలాంటి వూళ్లల్లో ఏముందీ?... ఏ బజారు చూసినా సైడ్ కాల్వలు- స్వచ్ఛమైన గాలి వుండనే వుండదు ఇక్కడ. జీవితాన్ని మరపించే ప్రకృతి దృశ్యాలు అక్కడ... డబ్బు- అన్యాయము; మోసమూ; కపటమూ; ఈర్ష్య- అసూయ- క్రూరమూ- ఇవేగా ఇక్కడ. నాకు సౌందర్యం తగ్గగానే- ఈ ప్రేమ పోతుందన్నావు. అది చాలా పొరబాటు. ప్రేమ ఎప్పుడూ నశించేది కాదు. కారణ భూతంగా కలగదు అసలు ప్రేమ అనుకుంటున్నావు. సుబ్బారావు గారికి డబ్బు వుంది- అతను పోషించ గలడు అంటావు, ఆయనకు డబ్బు వుంటే ఏమీ అక్కర్లా. డబ్బుకోసం పెళ్లాన్నైనా తాకట్టు పెడతాడు... వెనక ఆయనెవరో అప్పు తీసుకోటానికి పెళ్లాన్ని అమ్ముకున్నాట్ట కదూ?... ఇలాంటి వాళ్ళకు పెళ్లాలు ఎందుకు చెప్పూ?...వడ్డీ బేరాలు చేసుకోక...ఇహ ఈ విషయంలో జోక్యం కలిగించుకోకు" అని చాలా 'సీరియస్'గా చెప్పా...

ఇహ ఆయన ఎలాగూ లాభం లేదనుకున్నాడు. నిరాశ ఆయన ముఖంలో స్పష్ట మౌతోంది. ఇహ నా విషయమై- సమస్తమైన 'హోప్సు', పోయినవాడి మాదిరిగా;

ఇహ నీయిష్టం నీది. నువ్వు వొచ్చేప్పుడు- ఆయనగారి పెట్టెలో అయిదు వందలు తీసుకొచ్చావుట కదూ? ఆ అయిదువందలైనా ఇలా పారెయ్యి. అతను బహుశా అందుకోసం కేసు కూడా పెడతాడేమో?...ఆ అల్లరి కూడా ఎందుకు?...' అన్నాడు.

"మామయ్యా! నే తీసుకొచ్చిన అయిదు వందలు ఆయన పెట్టెలోవే కాని; ఆయనగారి స్వంత సొమ్ము కాదు. ఇందులో దమ్మిడీ కూడా- ఆయనకు ఇవ్వనక్కర్లా... కేసు చేస్తానని బెదిరించట మేకానికీ కేసు కాధారమేముందీ?..."

"మరి ఎక్కడనుంచి వచ్చిందంటావు ఇంత సొమ్ము..."

"చెప్పమంటావా?... దీనికంతా చాలా పెద్దగాథ వుంది...ఆయనెవరో- పేరు తెలియదు, నాకోసమై సుబ్బారావు గారికిచ్చారు. ఇందులో చిల్లిగవ్వ కూడా- సుబ్బారావుగారి కివ్వను. ఇందుమూలంగా- ఇటు సుబ్బారావుగారికీ- అటు ఇచ్చిన పెద్దమనిషికీ తగినశాస్తి కావాలి."

ఇలా అంటూంటే మా మామయ్యకు చాల ఆశ్చర్యం వేసింది. ఈ పైకం ఎలా వొచ్చిందో పూర్వగాథ ఆయనకు తెలియదు.

"ఏమిటి సుశీ! నిజం చెప్పు. ఆ పైకం ఎలా వొచ్చిందీ...? ఇచ్చిన పెద్దమనిషి యెవరు?...నీ కోసం ఇచ్చేవాడు ఆయనగారి చేతికెందుకిచ్చాడు?-చాలా ఆశ్చర్యంగా వుందే?..." అన్నాడు చాలా ఆదుర్దాతో- వినాలనే కుతూహలంతో...

మా మామయ్యకు ఏదిచెప్పినా నేను నిజంమాత్రం చెబుతానని గట్టి నమ్మకంవుంది...

"చెబితే ఇప్పుడు తేలేదికాదు మామయ్యా-! రెండు గంటలు కావొచ్చింది. కాస్సేపు వెన్ను వాల్చరాదూ?..." అన్నా...ఆయనకు వినాలని కుతూహలం బాగా వుంది. చెప్పేదాకా నన్నసలు నిలవనీయలా...

"మామయ్యా! సుబ్బారావుగారంటే -చాలా పెద్దమనిషి-అని అంతా అనుకుంటున్నారు. ఆయనగారి ఘరానా తనమంతా, డబ్బు విషయు రానంతవరకే... నే నసలు ఈచరిత్ర వెల్లడి చెయ్యతలచుకోలా. ఇది ఆయనగారి దుశ్చరిత్రం ఈ విషయం లోకానికి తెలిస్తే-

ఆయనగారి మొహంమీద ఉమ్మెయ్యని వారుండరు. డబ్బుమీద ఆశ-దురాశ, అలా చేయించింది. పాపం తెలివితక్కువవాడు. గంభించి వూరుకున్నవాడు. వూరుకోక సిగ్గులేక ఈ పైకం తీసుకు రమ్మని ఎలా కబురంపాడూ?...

అసలు సంగతి ఏమిటంటే!...-

"ఆ వూళ్ళోనే ఒక ఆఫీసరు వుండేవాడు. ఆయన ప్రస్తుతః లక్షాధికారి వయసు చెల్లినవాడు. నెరసిన మీసాలైనా రంగు వెయ్యటం వల్ల పడుచువాడిలాగే వుంటాడు చూట్టానికి. "చింతచచ్చినా పులుసు చావలేదు" అన్నట్లు-ఆయనలో రాసిక్యత ఇంకా నశించిపోలా... నేను రోజూ క్లబ్ కు వెళ్లి వస్తూంటే నేనంతా అతని సొమ్మైనట్లు-తదేక దీక్షగా; మేడ వరాండాలోనుంచుని విపరీతంగా చూసేవాడు. అతని కళ్లల్లో-ఆశ-పూర్తిగా కనపడుతూ వుండేది. ఆడది కనపడగానే రెపరెపలాడే మనిషి ఎందుకో నేనంటే అతనికి విపరీతమైన ఇష్టం. నేను ఒకవేళ యాదృచ్ఛికంగా అటువైపు చూస్తే-అతని వొళ్ళో కూచున్నట్లే భావించుకుని సంతోషించేవాడు. కాని అతన్ని చూస్తేనే నాకు పరమ అసహ్యం. నాకు క్లబ్ కు వెళ్లటానికి రావటానికి అదేమార్గం అవటం మూలంగా; ఆయన కంట పడక తప్పేదికాదు. ఆ మీసాలూ ఆనల్లటి శరీరమూ, అమ్మో! ఆ పేరెత్తితేనే భయంవేస్తోంది. దెయ్యంలా వుండేవాడు... రాను రాను ఆయనగారి స్థితిలనే కనపడక పోతే; పిచ్చెత్తే స్థితిలోకి వొచ్చింది. నే తలవొంచుకుని వొస్తూంటే ఆయన్ని చూసేసిగ్గుపడ్డా ననుకునేవాడు. అతని మానసిక స్థితి అంతా నే గ్రహించా. ఇతరులు తమ భార్యల వంక అలా చూస్తే సహించలేరే వీళ్లు-; ఆ మాత్రం వోర్పు లేదే వీళ్లకి: ఇతరుల భార్యల వంక ఎందుకలా చూడటం?...తమ ఆడవాళ్ల లాంటి వాళ్లు కాదూ అందరి ఆడవాళ్ళూ?...

"ఇలా కొన్నాళ్ళు గడిచాయి. ఒకసారి సుబ్బారావు గారితో ఏదో మాటల సందర్భంలో ఈ విషయం వొచ్చింది. ఏమనుకున్నాడో మనసులో- ఆన్నీ విషపుబుద్ధులేగా!... నాకు ఆయన్ని వోసారి చూపిస్తావా? అన్నాడు. సరేనన్నా...నిజంగా కాటికి కాళ్ళు చాచుకుని- పింఛను పుచ్చుకుంటూన్న ఆ ముసలాయనకు నాలాంటి ఆడది ఎందుకు చెప్పా?...ఏం సంతోషింపగలడని?..."

"మర్నాడు నే క్లబ్ కు వెళ్ళి వొస్తూంటే; సుబ్బారావు గారు- ఆయన ఇంటి సమీపంలోనే ఎదురుగా వొచ్చారు. ఆ యిల్లు చూపించా- ఆయనగారి నీ చూపించా... నే యింటి కొచ్చేశా..."

ఇంతలో ప్రకాశరావు నిద్రలేచి- ఓ! టైమెంతైంది- అని వొళ్ళు విరుచుకుని కూర్చుని- సిగరెట్ ముట్టించి టీకి ఆర్డరిచ్చాడు. నేను మాత్రత నా ధోరణిలో చెబుతూనే వున్నా...అతనికిలాంటి విషయాల్లో- అసలు జోక్యం లేదు. కొంతమంది- అదే దృష్టితో- ఇద్దరు మెల్లిగా మాట్లాడుకుంటున్నారంటే అక్కడకే చేరుతారు ఏదో పనిముంచుకు పోతూన్నట్లు.

"సుబ్బారావుగారు- ఆయనగారి ఇంటికెళ్ళి ఆయనతో ఏదో పరిచయం కల్పించుకుని యింటికి తీసుకొచ్చారు. పక్క హొటల్నుంచి టీ తెప్పించారు. టీ తాగుతూ వుండగా -నన్ను చూపి ఈమె Wife. స్కూల్ ఫైనల్ ప్యాసయింది. అని నన్ను ఆయనకు పరిచయం చేశారు. ఏమిటా? ఈ హంగామా అంతా అని ఆలోచిస్తున్నా..."మీ సంగతంతా నాకు తెలిసింది. మరి-" అనేసరికి ఆయనకు పై ప్రాణాలుపైన పోయి. కొడతాడనుకున్నాడు కమోసు.- మీరు నాకు వో సహాయం చెయ్యాలి. కాస్త తెప్పరిల్లాడు ఆ మనిషి. పాపం! నిజంగా నాకోసమై ఆయన ఆస్తి అంతా రాసి ఇవ్వమన్నా ఇచ్చే పరిస్థితిలో వున్నాడు.

నా సాధ్యమైనంతవరకు ఏ సహాయమైనా చేస్తానన్నాడు. సుబ్బారావుగారు ఇలా మాట్లాడుతోంటే ఆయనకి ఆశ్చర్యం వేసింది. నా అవసరం– అయిదు వందల రూపాయిలు;– మీరు తీరిస్తే– మీ అవసరం నే తీరుస్తానన్నాడు. నాకు వళ్లు భగ్గున మండిపోతోంది. కాలి జోడుతో ఇద్దరినీ– మాట ఎలావున్నా– సుబ్బారావు గారిని తందామా అనిపించింది. ఇంకా అదృష్టవంతుడు. సరే యింటికి వెళ్లి పంపుతానన్నాడు. ఏనుగునెక్కినంత సంతోషంతో వెళ్లిపోయాడు. సుబ్బారావుగారికీ నాకూ యీ విషయమై చాలా వాగ్వాదం జరిగింది."

ఇంతలో టీ వొచ్చింది. ప్రకాశరావు టీ తాగుతున్నాడు. నేను తాగుతూనే చెప్పటం ప్రారంభిచా; మా మామయ్య టీ తాగడు... ఆయనకు కావాల్సింది నస్యం ఒక్కటే...

"భర్తచెప్పిన మాటల్లా భార్య వినాలి ఆదితప్పైనా సరే. ఇది మన హిందూ ధర్మశాస్త్రం. అయిదు నిమిషాలు కళ్లుమూసుకుంటే అయిదువందలు రాబడతా. ఇలా ఆయనగారి ఆస్తిలో చాలా భాగం మనం ఆక్రమించుకోవచ్చు... అన్నాడు. అప్పుడు నేనేం సమాధానం చెప్పాలి?... చదువుకున్న విజ్ఞానమూర్తే ఏమైనా మెదడువుండి మాట్లాడిన మాటలేనాయివి?... ఛా! అలా అంటాడా? అని నీకు పూర్తిగా సందేహం కలగవొచ్చు. అబద్ధం నేను చెప్పేది లేనిదీ నీకు తెలియదూ?...ఇటీవల సృష్టిలో సుబ్బారావులాంటి మానవమ్మన్యమానులుకూడా వుంటున్నారు...అబద్ధంకాదు. కావాలంటే —ఇంకా నీకు కొన్ని కేసులు అలాంటివి చూపెట్టగలను. ఆయన మీది విరోధంతో–నేను పన్నిన పన్నాగంకాదిది. ఉన్నదున్నట్లు కపటంలేకుండా చెబుతా కనుక నే– అందరికీ విరోధినినేను. అలాచెబితే అసలు ఎవకీ అర్థంకాదు. ఇలాంటి బుద్ధులువున్న ఆయనతో కాపరం చెయ్యకపోవడం నా దితప్పాట... ఎందుకు ఆ ధర్మశాస్త్రిలు మామయ్యా! వాటిని తగలెయ్యరాదూ?...ఈ కాలంలో ఆ శాస్త్రిలు ఏం పనికివొస్తాయి?... వాటి అవశరం, టైమూ దాటిపోయింది... పెళ్ళి చేసుకున్నందుకు– శరీరం–రుచులూ, జ్ఞానం, అన్నీ అమ్ముకున్నదికదా అని–డబ్బుకోసం మానాన్నికూడా వ్యర్థంచెయ్యమంటారే–వీళ్లు మానసత్వంవున్న మనుష్యులేనా?...అంత ధనాశాపరులకుసంసారపు గొడవలుఎందుకు చెప్పు?.....మా స్వాతంత్ర్యం— మాటేస్తు చంపేశిందేకాకుండా— కూడూ గుడ్డా ఇస్తున్నామని–మా నాన్నికూడా నాశనంచేస్తామంటే– ఎంత పౌరుషం చచ్చిన ఆడదైనా అంగీకరిస్తుందా?..."

ఇంతలో మా మామయ్య ఏదో చెప్పటానికి ఉద్యుక్తుడైనాడు. నేనదంతా గ్రహించి;–

"మామయ్యా! నువ్వు అడగదలచుకున్న విషయం నాకు తెలిసింది. ప్రకాశంతో ఇలా రావటం మానాన్ని త్యజించికాదా అంటావు కాదు. ఎన్నటికీ కాదు...మన సారా ప్రేమించిన నా ప్రేమమూర్తి ప్రకాశరావు. నా హృదయచోరుడికి నా జీవితసర్వస్వానికి ప్రకాశానికి ఇవ్వకపోతే–నా మానాన్ని ఇంకెవరికిస్తానూ?...ఎన్ని జీవితాలవరకైనా; సృష్టిలోనే కాంక్షించేది— ప్రకాశరావునే... ఇవన్నీ ఒకరితో చెప్పుకునేందుకు; అనువైన విషయాలేనా?..." మెయిల్‌కు వేళయింది. ప్లాట్‌ఫారం మీద ముందు ప్రకాశరావూ– నేనూ– మా మామయ్యా నడుస్తున్నాం, పక్కనే కూలీలు సామానులు తెస్తున్నారు.

"నువ్వు– కనక చెప్పవలశిన అవసరం నీతో వుంది కనుక– చెప్పా... ఊరికే లేచి పోయిందంటే లేచిపోయిందను కోటమో– కాని– ఈ గుడ్డిలోకం– కారణం ఏమిటా అని ఆలోచించదు. ప్రతివాళ్లతోనూ

ఈ విషయం నే చెబితే- తనకున్న పేరు ప్రతిష్ఠలు మర్యాద నాశనం చెయ్యటమేనా? ఇంకేమన్నా వుందా?...అసలు ఈ లోకానికి ఆడదంటే అలుసెక్కువ. భార్యతో సుఖం లేదంటే- మగవాణ్ణి- ఇంకో పెళ్ళిచేసుకో అని సలహా యిస్తుంది లోకం. భర్తతో సుఖం లేదంటే- అసలు అలా అనకూడదు. లేకపోయినా- అలాగే- పడి వుండాలంటారు. ఏమిటీ ఈ న్యాయం...?"

"ఆయనగారు. అయిదువందలూ పంపాడు. నాకోసం కారు కూడా పంపాడు. ఆయన ఎక్కడ దాచిందీ చూశా ఆ పైకం. ఆనాటికి అస్వస్థతగా వుందని- కబురంపి ప్రకాశాన్ని ఫలానా టైముకు- ఫలానా చోటికి రమ్మని కబురంపా... ఆరాత్రే ఆయన లోపల భోజనం చేస్తూ వుండగా- ఆ పైకం తీసి దాచా..."

నేను మెయిల్లో కూచున్నా... మామయ్య ప్లాట్‌ఫారం మీద నోట్లో పుల్ల పెట్టుకుని- రైలు నానుకుని నుంచుని వుంటున్నాడు. పాపం! ఎంత ఇదైనా- ఆయన మధ్యవర్తిత్వం ఎందుకూ పనికిరాక పోయెనే అని మనసులో దిగులుగా వుంది. మధ్య వర్తుల కందరికీ అలాగే వుంటుంది తమ మాట వినకపోతే.


నీకు యిష్టం లేకపోతే- ఆయన అయిదువందలు ఆయనకే తిరిగి పంపలేకపోయావా? అన్నాడు...

"ఇచ్చేస్తే జ్ఞాపకం వుండదు. అలా ఇచ్చినందుకు; యిలా పుచ్చుకునందుకు సుబ్బారావుగారికీ ఇద్దరికీ బుద్ధి రాదు. నాకోసం పంపిన అయిదువందలు నావి కాని సుబ్బారావువి ఎలా అవుతాయి?...దమ్మిడీ ఇవ్వను. సిగ్గు లేకపోతే- ఇంకా కేసు ఏమని చేస్తాడో చేసుకోమను మరేం పర్వాలా...నేను విశాఖపట్నం వెళుతున్నా గుడ్‌బై- Good bye. అన్నా- రైలు కదిలింది.

మామయ్య- ఏదో చెపుతున్నట్లు వున్నాడు కాని- ప్లాట్‌ఫారం దాటింది మెయిల్. ఇంజన్ చప్పుడులో, మెయిల్ వేగంలో మాటలు వినబడటంలా——.


# జీవబ్రహ్మైక్య రాజయోగ సారామృతము

ఇది కడప శ్రీపరమహంస సచ్చిదానంద యోగీశ్వరులవారిచే ముద్రింపబడినది.



1276-పుటలు, 48-పటములుగలది, మూడవ కూర్పు.

| | | |
|---|---|---|
| కాలికోబయిండు | రూ. | 4-4-0 |
| గూఢార్థ సంగ్రహ సహిత శ్రీ భగవద్గీత | రూ. | 2-4-0 |
| శ్రీ కబీర్‌దాసు చరిత్రము | రూ. | 2-4-0 |
| శరీర దేవాలయ రహస్యార్థ పారిజాతము | రూ. | 0-6-0 |

## చిత్రగుప్త ఆఫీసు

సౌకారుపేట పోస్టు, మదరాసు.